# సాయంకాలం

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా (స్మర్నా, జార్జియా)

మా డాబాకి యింకా పిట్టగోడ కట్టలేదు. అక్కడ కూర్చుంటే యూనివర్సిటీకి అవతల, దూరంగా కొండలలోకి దిగిపోతున్న సాయంకాలం సూర్యుణ్ణి స్పష్టంగా చూడవచ్చు. ప్రతీ సాయంత్రం డాబాపైకి వెళ్ళి కూచోండే నాకు తోచదు. సంజవేళ నాలో ఎన్నో ఆలోచనలు – ఒక్కసారిగా ప్రపంచానికి యేదో అయిపోయినట్లు, సూర్యుణ్ణి ఎవరో ఎత్తుకు పోతున్నట్లూ, ఏదో తెలియని సంఘటన జరగబోతున్నట్లూనూ. ఆ సంజలో ఏదో తెలియని ఆందోళన, ఎంతో చక్కని ప్రశాంతత. ఎన్ని విరుద్ధ భావాల సమ్మేళనం! కళ్ళముందు జరుగుతోన్నదంతా నాటకమని తెలుసుకొని, కళ్ళుమూసుకొని, తనలోతానే మరి దేనికోసమో అన్వేషిస్తున్న మౌన తపస్విలా మారిపోతుంది ప్రకృతి. నీళ్ళటాంకుని ఆనుకుని, కాలంతోబాటే కరిగిపోయే ఆ సూర్యుడివైపే చూస్తూవుంటాను. ఉదయంనుంచీ వెలుగుని ప్రసాదించిన తను వెళ్ళిపోతూంటే, ఎవరూ పట్టించుకోకుండా, హాయిగా వీధుల్లోనూ, యిళ్ళలోనూ దీపాలు వెలిగించుకుంటున్నారనే కోపంతో ఆయన వదనం ఎఱ్ఱగా మారిపోతుంది. ఇంక యీ అవకాశవాదులకి తన అవసరంలేదని తెలుసుకున్నాక, కొండలదుప్పటి మొహంమీద కప్పుకుని ఎంతోసేపు ఏడుస్తాడు. "సముదాయించడానికా?" అన్నట్లు పక్షులన్నీ ఆయన్ని వెతుక్కుంటూ వెడుతూంటాయి. ఎక్కడెక్కడినించో గాలికి కొట్టుకొని వచ్చిన మేఘాలు, కొన్ని పలకరించుకుని విడిపోతాయి. కొన్ని కలిసి కబుర్లు చెప్పుకుంటూవుంటాయి. "ఆ పెద్దమేఘాలన్నీ అలాగే వుండిపోతే ఎంతబాగుండును!" అనుకుంటాన్నేను.

అంతలోనే ఓపెద్ద గాలికెరటం నిర్దాక్షిణ్యంగా ఆ మేఘాల్ని చీల్చేస్తుంది. చిన్న చిన్న ముక్కలుగా చేసి దూరంగా విసిరేస్తుంది. కొత్తచెలిమికోసం చేతులు చాచుకుంటూ వెళ్ళిపోతాయి కొన్ని. పాతనేస్తాలను మరవలేక, కొత్తవాటితో కలవలేక సతమతమౌతాయి కొన్ని. ఏకంగా గాలితోనే నేస్తం కట్టి గాలివాటుగా ఎగిరిపోతాయి యింకొన్ని. వాటికి గమ్యంగురించి చింతలేదు. "చేరుతామా?" అన్న అనుమానము రాదు, "చేరవేమో?" నన్న భయమూలేదు. వాటి కర్తవ్యమల్లా 'స్థితప్రజ్ఞ'ల్లా ప్రయాణించడమే.

ఎక్కడికి పోతాయా మేఘాలు? ఎక్కడికి వెళ్ళిపోతాడా సూర్యుడు? కొంపతీసి చనిపోడు కదా! ఛ. ఛ. అలాజరగదు. అసలు చనిపోవడమనే ప్రక్రియకు ముందు పుట్టుక అనేది వుండాలిగదా! అందుకే నాకు అతడిమీద అంతనమ్మకం. అతనితో "నేనెవరు?" అని అడగాలని ఆశ. జననానికి ముందు, మరణానికి వెనుక, నా ఉనికిని చూపించమని వేడుకోవాలనే కోరిక. ఇక్కడ విడిపోయిన మేఘాలు ఎక్కడైనా కలుసుకున్నాయో? లేదో? ననే ఆదుర్దా. అందుకే ప్రతీ సాయంత్రం మేడమీదకు వస్తాను. ఆ సూర్యుణ్ణి పలకరిస్తాను. అసలు నన్ను గుర్తు పట్టడు.

"నీవెవరో నాకు తెలియదం"టాడు. "నేనెవరో నీకు తెలుసా?" అని ఎదురు ప్రశ్నిస్తాడు. "ఇతను నీకు తెలిసిన నిన్నటి సూర్యుడు కాదం"టూ ఎగిరి పోతాయి పక్షులు. మేఘాలకేసి చేతులూపుతాను. పట్టనట్లుగా పారిపోతాయి. బహూశా అవికూడా నిన్నటి మేఘాలు కావేమో? అయినా కాలంతోబాటూ కదిలిపోయిన మేఘాలనీ, వదలిపోయిన సూర్యుణ్ణీ కలుసుకోవాలనుకుంటున్న నేనెంత వెఱ్ఱి వాణ్ణి! అసలీ చరాచర సృష్టిలో నాప్రాధాన్యత ఎంతని? ప్రతిరోజా సాయంత్రమౌతుంది. కానీ నాప్రశ్నలకి సమాధానం దొరికే ఆ సాయంకాలం ఎప్పుడు వస్తుందో? ఆ పరిచయమున్న సూర్యుణ్ణీ, పలకరించే మేఘాలనీ ఎప్పటికైనా కలుస్తాననే ఆశతో యిప్పటికి రోజా సాయంకాలవేళ మేడమీదకి పోతూంటా. ....

---

# అరుదెంచె ఆమని–ఈ విశ్వ వేదిక

డొక్కా రామభద్రరావు (అట్లాంటా, జార్జియా)

అలమావి పూసజ్జ నింపుగా సవరించి
యిలదించె స్వర్గమ్ము నందాల ఆమని
తొలి సంజె వెలుగులకు కెంజాయ తళుకిచ్చి
కదిలించె హృదయమ్ము నాహ్లాదయామిని
సరికొత్త స్వరములను సొంపుగా పలికించి
మధురసము కురిపించె నెలకోయిలమ్మ
గిరుల తల్పమునుండి వింజామరలు తెచ్చి
ముచ్చటగ వీచింది ఓ మలయపవనమ్ము
కిసలయమ్ముల పాన్పు శయనించ నెంచి
వినువీధి పయనించె రామచిలుకల జంట
వాసంత గీతికే వింతశోభను దెచ్చి
వంత జావళి పాడె నేడు విరిరాణి

మావి మూపులపైన మొగలి తోపులపైన
మసలి వచ్చేనేమొ ఈ మంచుకెరటము
వీధి ముంగిళ్ళకు, జాజి పందిళ్ళకు
మేలి ముసుగై వీచె నీ మృదుల పవనము

మంచిగంధము పూచి మనసులాలించగా
మము మరువదెన్నడూ మరువంపురాణి
నేల నాల్చెరగులా నడయాడి నర్తించి
వాల్జడను విదిలించె వనిత వాసంతి
మందార, మాలతీ, మల్లె వికసించె
మరుల తేరును ఎక్కి మదనుడేతెంచె
పరువాల పందిరిలో పైట సవరించె
సొగసు వయ్యారాల వధువు వనకాంత
మెరుపు తోరణ మిపుడు మెరుగుగా కట్టంగ
ప్రకృతంతా విడిది, పసరు పారాణి
విరిసుధలు తలంబ్రాలు, తారలక్షతలు
లోకకళ్యాణము సకల శుభకరము
సర్వాంతరంగాల సంతోష గీతిక
అలరు ఆమని రాక అందాల వేడుక
సరదా(సా)ల మొగసాల "యువ" "భావ" మాలిక
స్వగతించె స్వగతించె నీ విశ్వవేదిక